క్లుప్తంగా

పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టాలి

అంబర్‌పేట: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. వచ్చే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు. బుధవారం అంబర్‌పేట సీపీఎల్ బాయ్స్ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ డీఈఓ విజయ లక్ష్మితో కలిసి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 'మన బస్తీ – మన బడి' పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌లు

అంబర్‌పేట: నియోజకవర్గంలో పైప్‌లైన్‌ను ఆధునీకరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ మేదర బస్తీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కావాల్సిన నిధులను భారీగా మంజూరు చేయిస్తున్నామన్నారు.

అన్నదానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ సంఘ సేవకుడు సిలుముల నర్సింహ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం బాగ్‌లింగంపల్లిలోని భగత్‌సింగ్‌నగర్‌లో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్, రాజేష్, బాబు, శివకుమార్, సామ్‌సన్‌రాజు, పరమేష్, చిన్నా, నర్సింహ్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం



నల్లకుంట: కలుషిత నీటి సరఫరా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత అన్నారు. గత కొంత కాలంగా తిలక్‌నగర్‌లో నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. దీంతో స్థానికులు ఈ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె బుధవారం జలమండలి సిబ్బందితో కలిసి పర్యటించి సమస్యను పరిష్కరించారు.

ఈనెల 26న పర్యావరణంపై చిత్రలేఖనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 26 ఆదివారం ఉదయం 10.30 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్ బాలభవన్‌లో పర్యావరణం అనే అంశంపై చిత్రలేఖనం ఉంటుందని ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు కె.వీ.రమణాచారి, డీఎఫ్ఓ కొండా మోహన్, సీనియర్ పాత్రికేయులు బీ.వీ.ప్రసాద్‌లు హాజరవుతారని నిర్వాహక సంస్థ నాయకులు ఉప్పల వెంకటేష్‌గుప్తా, ఎస్.హెచ్. రంగయ్యలు తెలిపారు.

అల్లం పద్మకు నివాళి



ముషీరాబాద్: ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సతీమణి అల్లం పద్మ ప్రథమ వర్ధంతి టూరిస్ట్ ప్లాజాలో జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్‌లు ఆమె చిత్రపటానికి నివాళులర్పించి అల్లం నారాయణను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జాతీయ స్థాయిలో సికింద్రాబాద్ శాఖ సత్తా చాటాలి

1న గోవాలో తపాలాశాఖ సాంస్కృతిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్

చిక్కడపల్లి: తపాలాశాఖ సికింద్రాబాద్ విభాగం గోవాలోని పనాజీలో జరిగే జాతీయ సాంస్కృతిక పోటీలలో వివిధ కళా ప్రదర్శనల్లో ప్రతిభ చూపి అత్యధిక బహుమతులు పొంది సత్తా చాటాలని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాదీక్షితులు కళా వేదికపై మార్చి 1నుంచి పనాజీలో జరిగే తపాలా జాతీయ సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొనే సికింద్రాబాద్ విభాగంలోని తపాలా ఉద్యోగ కళాకారుల ఎంపికకు పోటీలు జరగగా.. ముఖ్య అతిథిగా ప్రకాష్ పాల్గొని కళలు ఉద్యోగులలో శక్తిని ఉత్తేజం కలిగిస్తాయన్నారు. పని ఒత్తిడి నుంచి ఊరటకు మంచి సంగీతం, నృత్యం, నాటకాలు సాధనాలన్నారు. హైదరాబాద్ డివిజన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీ.ఎస్.రెడ్డిలు పోటీలకు ఎంపికైన ఉద్యోగ కళాకారులకు తమ అభినందనలు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసులు కె.ఏ.దేవరాజ్ ఆధ్వర్యంలో వివిధ కళా ప్రక్రియల్లో ఉద్యోగ కళాకారుల ఎంపిక జరిగింది. తపాలాశాఖ అధికారులు, ఉద్యోగులు నరేష్, డీఆర్ నరసింహరావు, రవికాంత్, వెంకటేశ్వర్లు, యాదగిరి, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా వనజా ఉదయ్, సంధ్య, శారదలు వ్యవహరించారు.

పోస్టాఫీస్ పొదుపు పథకాలపై పెరిగిన వడ్డీ రేట్లు

అంబర్‌పేట: తపాలా శాఖలో పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ టీఏవీ శర్మ తెలిపారు. ఈనెల 24 వరకు అన్ని పోస్టాఫీసుల్లో పొదుపు పథకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అంబర్‌పేట్ పోస్టాఫీస్‌లో పొదుపు పథకాలను అత్యధికంగా చేసిన సిబ్బందిని ఆయన బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టాఫీస్ పొదుపు పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టాఫీస్ సిబ్బంది సావిత్రి, సుభాష్, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని సత్కరిస్తున్న పోస్టాఫీస్ సూపరింటెండెంట్ శర్మ

ఘనంగా ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం

ముషీరాబాద్: సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా పార్టీ ఆవిర్భావ దినోత్సవం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బుధవారం పార్టీ జెండాను ప్రజాపంథా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి అన్వేష్ ఆవిష్కరించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మతో కలిసి మాట్లాడారు. దేశంలో విప్లవ పార్టీలు ఏర్పడి 50 ఏళ్ల గడిచినా లక్ష్యం వైపు ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కిలా తయారై తీవ్ర స్థాయిలో నష్టపోయిందన్నారు. దేశంలో విప్లవం రావడానికి రైతులు, కార్మికులను మమేకం చేసి ఉద్యమించడంలో విఫలమయ్యామని వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులను విప్లవ పార్టీలు గుర్తించడం లేదన్నారు. కే.ఎస్.ప్రదీప్, స్వరూప, ఎస్.నాగేశ్వర్‌రావు, బోయినపల్లి రాము, కిరణ్, రవికుమార్, నల్లన్న, రామకృష్ణ, లింగంగౌడ్, ఆజాద్, రవి, వరలక్ష్మి, అనిల్, ప్రవీణ్, స్వాతి, సుమంత్, దేవమణి, లత, నారాయణ తదితరులున్నారు.



వీధి కుక్కలను నియంత్రించడంలో జీహెచ్‌ఎంసీ విఫలం

అంబర్‌పేట: వీధి కుక్కలను నియంత్రించడంలో జీహెచ్‌ఎంసీ యంత్రాంగం విఫలమైందని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చుక్కాజగన్‌తో కలిసి ఆమె మాట్లాడారు. వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందడం విచారకరమన్నారు. వీధి కుక్కల బెడదపై ప్రజల ఫిర్యాదులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది సరిగ్గా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది కుక్కల బెడదపై అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

చెక్కుల పంపిణీ

కరోనాతో మృతి చెందిన చిన్నారుల తల్లిదండ్రులు



చిన్నారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్‌నగర్‌లో కరోనాతో తల్లిదండ్రులు మృతి చెందిన 17 మంది చిన్నారులకు ఎస్ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో చెక్కులను విద్యార్థుల స్కూల్ వార్షిక ఫీజు నిమిత్తం అందజేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎస్ఆర్‌డీ సంస్థ సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాస్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ అలీ, నాయకులు జునేద్ బాగ్దాది, మున్వర్ చాంద్, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు పార్వతి, శివరాణి, ఇందిర తదితరులున్నారు.

ఓయూలో ముగిసిన సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్వహించిన అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల కళారూపాలను ప్రదర్శించి అబ్బురపరిచారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగిన సాంస్కృతిక పోటీలు బుధవారం ముగిశాయి. వారం తరువాత ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించిన ఈటల

రాంగోపాల్‌పేట్: నేడు ప్రభుత్వ ఉద్యోగాలు అందని ద్రాక్షలా మారాయని.. అవి కేవలం 3 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి, గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ, లాస్య ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. గ్రూప్ 4 అభ్యర్థులకు ఈ శిక్షణఇస్తారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. నిరంతరం ఆకాశమే హద్దుగా ప్రయత్నం సాగించాలని సూచించారు. కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్, లాస్య ఇన్ఫోటెక్ ఎండీ ఓరుకంటి వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రకు విశేష స్పందన



ముషీరాబాద్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ముషీరాబాద్ నియోజకవర్గ నాయకులు నాగేష్‌ముదిరాజ్ తెలిపారు. బుధవారం రేవంత్‌రెడ్డి పాదయాత్రకు సంఘీభావంగా వరంగల్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా యాత్రకు సంఘీభావం తెలుపుతున్నారని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి యాత్రను తలపిస్తోందన్నారు. బీఆర్ఎస్ నాయకులు యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ.. చురుకుగా పాల్గొంటున్న యూత్ కాంగ్రెస్ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దాడులకు భయపడదని స్పష్టం చేశారు.

'నిధులు మంజూరైన పనులు ప్రారంభించరా'

ముషీరాబాద్: నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిధులు మంజూరైన వెంటనే ప్రారంభించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. శివాలయం వీధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో బుధవారం చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ నవీన్‌లతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏక్‌మినార్, పఠాన్ బస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివాలయం వీధిలో తాగునీటి పైపులైన్ కోసం స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు.

- షేర్ అలీ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా.. నేటికి పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పైపులైన్ వేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు.



జలమండలి అధికారులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్

- ఏక్‌మినార్ చౌరస్తా వీధిలో పబ్లిక్ ట్యాప్‌లను పునరుద్ధరించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్‌చారి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, రామారావు, శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్‌యాదవ్, పరశురామ్‌యాదవ్ తదితరులున్నారు.

యువతి ఆత్మహత్య

అంబర్‌పేట: ప్రేమ విఫలమై ఓ యువతి మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక తులసినగర్‌లో నివసించే స్రవంతి (30) ఒంటరిగా ఉంటుండగా.. ఆమె ఇద్దరు సోదరులు రామాంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా మంగళవారం ఉదయం 9.30 నిమిషాలకు ఓ సోదరుడు పూర్ణచందర్‌రావు భార్య కళావతి స్రవంతికి ఫోన్ చేయగా తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె భర్త పూర్ణచందర్‌రావుతో కలిసి గోల్నాకకు వచ్చారు. అనుమానం వచ్చి తలుపులు బలంగా తీసి చూసేసరికి స్రవంతి ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

చిక్కడపల్లి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ కృషినగర్‌కు చెందిన మేడా మల్లేష్ భార్య భారతి (54) గృహిణి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించక పోవడంతో బుధవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

చిక్కడపల్లి: బాగ్‌లింగంపల్లి పాలమూరు బస్తీలో నివసించే చుక్కా జంగయ్య (45) ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతడు కూలి పనిచేస్తుండేవాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుమారుడు చుక్కా శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలి

లిబర్టీ: అంబర్‌పేటలో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి ప్రదీప్ కుటుంబానికి రూ. పది లక్షల పరిహారం, జీహెచ్‌ఎంసీలో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెసిడెన్షియల్ మెస్‌చార్జీలు పెంచాలి

సాంఘిక సంక్షేమ మంత్రికి ఆర్.కృష్ణయ్య వినతి

ముషీరాబాద్ (హైదరాబాద్): పెరిగిన ధరల ప్రకారం ఎనిమిది లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాలేజీ, హాస్టల్, పాఠశాల హాస్టల్ విద్యార్థులు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాంఘిక సంక్షేమ శాఖమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ, మల్లేష్‌యాదవ్, అంజి, జనార్దన్, నందగోపాల్, రాజ్‌కుమార్, రాజేందర్, రాంకోటి, భూపేష్‌సాగర్, రఘుపతి, నిఖిల్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. మెస్‌చార్జీల, స్కాలర్‌షిప్‌ల పెంపుకోసం సీఎం కేసీఆర్ సోషల్ వెల్ఫేర్ మంత్రి, బీసీ వెల్ఫేర్ మంత్రి, ట్రైబల్ వెల్ఫేర్ మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఈ కమిటీ వెంటనే సమావేశం జరిపి మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచుతూ సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు.



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘం నేతలు

సహకార సంఘాల ముసాయిదా బిల్లును వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బహుళ రాష్ట్ర సహకార సంఘాల బిల్లు–2022 ప్రాథమిక సహకార సంఘాల నమూనా నియమ నిబంధనలు, వ్యవసాయ రంగాన్ని, సహకార సంఘాలను కార్పొరేట్ శక్తులకు అప్పజేప్పే విధంగా ఉన్నాయని వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహ్మారెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.

- సహకార సంఘాలు రాష్ట్ర జాబితాలోని అంశమని భారత రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో రాష్ట్ర జాబితాలో ఉన్న 32 అంశాల్లో సహకార సంఘం ఒకటన్నారు.
- మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో సహకార సంఘాలను తమ చేతుల్లోకి లాక్కోవాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని విమర్శించారు.
- రాష్ట్ర జాబితాలో ఉన్న అంశాలను కేంద్రం తన గుప్పిట్లోకి లాక్కోనే ప్రయత్నం చేయడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఇప్పటికే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాయని సహకార సంఘాల సవరణ బిల్లు– 2022ను లోక్‌సభలో డిసెంబర్ 7న ప్రవేశపెట్టారన్నారు.
- గతంలో ఉన్న చట్టానికి అనేక సవరణలతో ఈ బిల్లును తీసుకురావడం సరి కాదన్నారు. ఏదైనా సహకార సంఘం ఉనికిలో ఉన్న బహుళ రాష్ట్ర సహకార సంఘంలో కలిసేలా ఈ బిల్లు అవకాశం కల్పిస్తుందన్నారు.
- కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం ఉపాధ్యక్షులు చంద్రారెడ్డి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, ప్రొఫెసర్ ప్రసాదరావు, భూమన్న, ఆర్.వెంకటరాములు, వస్కుల మట్టయ్య, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీతం



చిక్కడపల్లి: కళాతపస్వి కె.విశ్వనాథ్ జయంతి ఉత్సవాల సందర్భంగా శౌర్య మ్యూజిక్ అండ్ ఎంటర్‌టైన్మెంట్ విశేష సినీ సంగీత కార్యక్రమం జరిగింది. బుధవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమం సభికులను అలరించింది. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన సినిమాల్లో ప్రముఖ గాయని వాణీజయరామ్ పాటలతో ఈ కార్యక్రమానికి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌బీఐ డీజీఎం, ప్రముఖ సాహితీ వేత్త గరికపాటి వెంకట్ మాట్లాడుతూ.. మహానుభావులకు మరణమనేది ఉండదని వారికి నీరాజనంగా పాటలు పాడిన గాయకులను ఈ సందర్భంగా అభినందించారు. వర్ధమాన కళాకారుడు శరత్‌సంగీత్ కళాభూషణ్ బిరుదుతో సత్కరించారు. అనంతరం గాయకులు కళ్యాణ్ కోటం రాజు, యోగిత అక్కిరాజులను సత్కరించారు.

సర్టిఫికెట్ల ప్రదానం

కవాడిగూడ: క్రీడా ఉత్సవాల్లో భాగంగా కవాడిగూడ డివిజన్ దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరిగిన విషయం తెలిసిందే. 'ఖేలో సికింద్రాబాద్, జీతో సికింద్రాబాద్' పోటీల్లో భాగంగా క్రికెట్, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మద్దూరి శివాజీ, పరిమళ్‌కుమార్, రంగారాజ్‌గౌడ్, భరత్‌గౌడ్, రమేష్‌రాం, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, వినయ్‌కుమార్, మహేందర్ బాబు, ప్రభాకర్, దిలీప్‌యాదవ్, అనిల్‌కుమార్, మోహన్‌సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నల్లకుంట: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం ఓయూ ఎన్సీసీ చౌరస్తా సమీపంలోని పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావీద్‌లు మాట్లాడారు. ఫీజు చెల్లించడంలో ఆలస్యం చేశారనే నెపంతో విద్యార్థుల నుంచి నెలకు రూ. 2000కు పైగా అపరాధ రుసుము వసూలు చేయడం దారుణమన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో అరబిందో ట్రస్టు పేరిట స్థాపించిన విద్యా సంస్థను నేడు వ్యాపార కేంద్రంగా మార్చడాన్ని ప్రశ్నిస్తే పాఠశాల యాజయాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం సరికాదన్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన అధిక ఫీజు డబ్బులను తిరిగి వారికే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ప్రతినిధులు నాగేందర్, స్టాలిన్, ఏసుదాసు, లక్ష్మణ్ తదితరులున్నారు.



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన డీసీఎం

డీసీఎంలో మంటలు !

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్ సమీపంలో పార్క్ చేసిన డీసీఎం టీఎస్12యూబీ 6137 అగ్ని ప్రమాదానికి గురైంది. బుధవారం మధ్యాహ్నం 12.35 నిమిషాలకు సమాచారం అందుకున్న ముషీరాబాద్ ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటల క్యాబిన్‌ను దాటి డీజిల్ ట్యాంక్ వరకు రాకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. అదే సమయంలో పక్కనే మరో డీసీఎం ఏపీ09వై 3262 స్వల్పంగా కాలిపోయింది. చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై డీసీఎం యజమానిని విచారించగా తనకు ఎవరిపై అనుమానం లేదని వెల్లడించాడు. కాగా కాలిపోయిన రెండు డీసీఎంలు ఒకే యజమానికి చెందినవి. ఆర్టీసీ కళాభవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ఈ రహదారిలో డీసీఎంలు అక్రమ పార్కింగ్ చేసి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని గతంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

పశుమిత్రలను కార్మికులుగా గుర్తించాలి

కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్

కవాడిగూడ: పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించి వారికి కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పశుమిత్రల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు వెంకటేష్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శారద, కాసు మాధవిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు.

- రాష్ట్రంలో వ్యవసాయానికి పాడి పరిశ్రమ ముఖ్యమైందని పాడి పరిశ్రమను చూసుకునే పశుమిత్ర ఉద్యోగులు అత్యంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. పశు మిత్రలను వెంటనే వర్కర్లుగా గుర్తించి వారికి కనీస వేతనం అమలు చేయాలన్నారు.
- ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలలో చురుకుగా ఉన్న సభ్యురాళ్లను ఎంపిక చేసి ట్రైనింగ్ ఇచ్చి పశుమిత్ర ఉద్యోగులుగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2500 మందిని నియమించారన్నారు.
- ఉద్యోగులు అంతా నిరుపేద కుటుంబాలకు చెందిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు పశుమిత్రలు పశుపోషకులకు పశుసంవర్ధక శాఖకు మధ్య వారధిలా పనిచేస్తున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి, వెంకటేష్ తదితరులు

- పశువులకు వైద్యసేవలు, పశుపోషణపై అవగాహన కల్పిస్తూ.. పశు ఉత్పత్తుల మార్కెటింగ్ సమాచారం, పశువుల బీమా మొదలైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
- పశుమిత్రలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పశుమిత్రలకు యూనిఫాం, గ్లౌజ్‌లు, మాస్క్‌లు, మందులతో కూడిన కిట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పని భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. యూనియన్ నాయకులు సంగీత, నజియాబేగం, ప్రియాంక, ఇందు, త్రివేణి పశుమిత్ర ఉద్యోగులు పాల్గొన్నారు.